
కాకినాడలో ఓటు వేసిన కలెక్టర్ షాన్‌మోహన్


కాకినాడ కలెక్టరేట్ హాలులో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులు




రాజవొమ్మంగిలో ఓటు వేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



గ్రాడ్యుయేట్ ఓట్లు!


కరపలో క్యూలైన్

- పోలింగ్ ప్రశాంతం
- పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం
- మందకొడిగా పోలింగ్
- నాలుగు గంటల్లో 20 శాతమే ఓటింగ్
- చివరకు 69.5 శాతానికి చేరిక
- రాజశేఖర్, వీరరాఘవుల మధ్యే పోటీ

మొత్తం 69.5%.. కాకినాడ జిల్లాలో 66.84 శాతం

(ఏలూరు/కాకినాడ/కలెక్టర్- ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి వివాదాలకు తావులేకుండా జరిగింది. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. పట్టభద్ర ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారనే ఊహలకు భిన్నంగా పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసేంతవరకు నెమ్మదిగా కొనసాగింది. అధికారులు నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ వచ్చారు. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో కేవలం 5.77 శాతమే మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఆరంభంలోనే అనేక పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక వెలవెలబోయాయి. ఉదయం 11 గంటల తర్వాత క్రమేపీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రావడం ఆరంభమైంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అడపాదడపా కనిపించారు. వాస్తవానికి ప్రచారంలో కనిపించినంత వేగం పోలింగ్ కేంద్రాలకు వచ్చేసరికి చప్పబడిపోయింది. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో ఓటర్లు తమంతట తాముగానే తొలి రెండు గంటల్లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు భావించారు. కానీ దీనికి భిన్నంగా ఆసాంతం ఓటర్లలో అలాంటి ఉత్సాహం ఏదీ కనిపించలేదు. ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇదే మాదిరి వాతావరణం కనిపించిందనే సమాచారం. పోలింగ్ శాతం అతి తక్కువగా ఉండడంతో టీడీపీ వర్గాలు మధ్యాహ్నం నాటికే అప్రమత్తమయ్యారు. తొలి నాలుగు గంటల్లో మొత్తం కేవలం 20 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఈ పరిణామాన్ని గమనించి ఎక్కడికక్కడ నియోజకవర్గ స్థాయిలో కేడర్‌ను అప్రమత్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాల్ని సందర్శించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. ఏలూరు	66	42,282	29,651	70.13
2. పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
3. తూర్పుగోదావరి	92	62,970	42,446	67.41
4. కాకినాడ	98	70,540	47,150	66.84
5. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
6. అల్లూరి సీతారామరాజు	12	4,669	3,637	77.90
మొత్తం	456	314984	2,18,902	69.50

రండి బాబు.. రండి

అతి తక్కువ ఓటర్లు ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తం పోలింగ్ శాతంలో ముందు వరుసలో నిలిచింది. ఇదే జిల్లాలో కేవలం 4 వేల 669 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 3 వేల 637 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 77.90 శాతంమేర నమోదైంది. అయితే ఈ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య కూడా అత్యల్పమే. తర్వాత స్థానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 73.09 నిలిచింది. అత్యల్పంగా కాకినాడ జిల్లా 66.84 శాతంతో నిలిచింది.

పోలింగ్ ఆసాంతం పోటా పోటీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ఒకవైపు మందకొడిగా సాగినా.. ఇంకోవైపు తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు మధ్య పోటీ హోరాహోరీగానే సాగినట్టే కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద తెలుగుదేశం, పీడీఎఫ్ అనుకూలురు ఎక్కడికక్కడ గుమిగూడి ప్రచారం చేసి వచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ పక్షాన ఓటర్లకు ఎరవేసేందుకు ప్రయత్నించారంటూ పీడీఎఫ్ అభ్యర్థి మద్దతుదారులు ఆరోపణలు చేశారు.


బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తున్న దృశ్యం

కాకినాడ జిల్లాలో ఓటింగ్ సరళి..

కాకినాడ/కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 27: కాకినాడ జిల్లాలో పట్టభద్రులు తమ హక్కు వినియోగించుకున్నారు. తొమ్మిది బూత్‌ల్లో అయితే రాత్రి ఏడు దాటాక కూడా తమ తీర్పునిచ్చారు. దీంతో జిల్లాలో 98 పోలింగ్ కేంద్రాల్లో 66.84 శాతం పోలింగ్ నమోదైంది. వాస్తవానికి గురువారం ఉదయం జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పోలింగ్ మందకొడిగా మొదలైంది. దీంతో ఉదయం పది గంటల సమయానికి జిల్లాలో పోలింగ్‌శాతం 10.18 మాత్రమే నమోదైంది. మధ్యాహ్నం 12 అయ్యేసరికి పోలింగ్ శాతం 25కు చేరింది. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్‌శాతం 41.48కి చేరింది. పోలింగ్ ముగిసే సమయానికి 62 శాతం నమోదైంది. కానీ జిల్లాలో పలు మున్సిపాల్టీల పరిధిలో తొమ్మిది బూత్‌ల్లో ఓటర్లు అధికంగా ఉండడంతో పోలింగ్ రాత్రి ఏడు వరకు కొనసాగింది. దీంతో మొత్తం ప్రక్రియ ముగిసే సమయానికి జిల్లాలో పోలింగ్ శాతం 66.84గా తేలింది. అంటే జిల్లాలో ఓటర్లు 70,540 మందికిగాను 47,150 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా 98 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ పరిణామాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకట్రావు ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యవేక్షించింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పలువురు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాకినాడ శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ పాఠశాలలో కలెక్టర్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరోపక్క పోలింగ్ సమయంలో పిఠాపురం పట్టణంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయడం తీవ్ర కలకలం చోటుచేసుకుంది. ఎన్నికల బరిలో ఉన్న ఒక ప్రధాన అభ్యర్థి అనుచరులు పట్టభద్రులకు సొమ్ములు పంపిణీ చేయడం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.


కాకినాడ జడ్పీ సెంటర్‌లో క్యూలైన్‌లో నిలుచున్న గ్రాడ్యుయేట్ ఓటర్లు


పిఠాపురంలో విభిన్న ప్రతిభావంతుడైన ఓటరుని పోలింగ్ కేంద్రానికి తరలిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ తదితరులు


కాకినాడలో ఓటుహక్కు వినియోగించుకుని తిరిగి వెళుతున్న ఓ వృద్ధురాలు

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 56 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలకు హాజరుకానున్న 44,531 మంది విద్యార్థులు
- ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు అనుమతి ఉండదు
- డీఐఈవో జీజీకే నూకరాజు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కాకినాడ జిల్లా డీఐఈవో (జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి) జీజీకే నూకరాజు తెలిపారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జరుగుతాయని, ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు అనుమతి ఉండదన్నారు. కాకినాడ జిల్లాలో 56 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు మొత్తం 44,531 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 22,660 మంది, రెండో ఏడాది పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 21,871 మంది హాజరుకానున్నారని ఆయన తెలిపారు. పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభమై 20 వరకూ కొనసాగుతాయన్నారు. మార్చి 1న ప్రథమ, 3న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, తాగునీరు, అత్యవసర వైద్యసదుపాయం, నిరంతర విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారులు, అదనపు డీవోలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, మూడు సిటింగ్ స్క్వాడ్స్‌ని నియమించినట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని డీఐఈవో పేర్కొన్నారు.


పిఠాపురంలో రథోత్సవం

పిఠాపురం పాదగయలో రథోత్సవం, నాకబలి-దండాడింపు
సామర్లకోటలో రథోత్సవం 7

రసవత్తరంగా సాగిన హాకీ సెమీఫైనల్స్ 7

వరాలిస్తారా!



- పయ్యావుల పద్దుపై ఆశలు
- కలగా ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ
- పనులు చేస్తామని బాబు, పవన్ హామీ
- సాగని ఏలేరు-తాండవ ప్రాజెక్టు
- రూ.వెయ్యి కోట్లకు డెల్టా ప్రతిపాదనలు
- కోటిపల్లి రైల్వే లైన్ పూర్తయ్యేనా
- కాకినాడ స్మార్ట్ సిటీ మాటేంటో..
- సూపర్ సిక్స్ హామీలకు ఎదురుచూపులు
- ఉమ్మడి తూర్పునకు వరాల జల్లు కురిసేనా

నేడే కూటమి బడ్జెట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి బడ్జెట్ కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఎదురుచూస్తోంది. నేడు రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్న పద్దు జిల్లాకు నిధుల వరద కురిపిస్తుందని నిరీక్షిస్తోంది. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జాడలేక జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిపోవడంతో జరిగిన నష్టానికి నిధుల విడుదలతో చికిత్స చేస్తారని ఆశిస్తోంది. వర్షాలు, వరదలు వస్తే ముంపులో చిక్కుకుపోయి ఏటా ఉమ్మడి జిల్లాలో అనేక నియోజకవర్గాలు విలవిల్లాడిపోతున్నాయి. ఏళ్లకు ఏళ్లు ముందుకు కదలకుండా కలగానే మిగులుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ నుంచి అటకెక్కిన డెల్టా ఆధునికీకరణ, ఆచరణకు నోచుకోని ఏలేరు-తాండవ కాలువ లింకింగ్, పూర్తికాని పోలవరం ఎడమ ప్రధాన కాలువ వరకు ఎన్నో సమస్యలు కూటమి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులతో తిరిగి పునరుజ్జీవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికలకు ముందు, ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటికి నిధులిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇవ్వడంతో ఈ మేరకు కేటాయింపులుంటాయని అంతా ఆశిస్తున్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్.. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతులకు నిధుల కేటాయింపులు ఏ మేర ఉంటాయనేది చర్చ నీయాంశంగా మారింది.

ఏలేరుకు మోక్షం లభించేనా..

కాకినాడ జిల్లాలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించేసింది. అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పిలిచిన టెండర్లను సైతం రద్దు చేసేసింది. ఇక అప్పటి నుంచి ఏలేరు ఆధునికీకరణ పక్కకు పోయింది. దీంతో వర్షాలు, వరద వచ్చిన ప్రతిసారీ ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. గతేడాది వరదలకు ఐదు వేల ఎకరాలు నీటమునిగాయి. అప్పట్లో సీఎం జగన్ గొల్లప్రోలు పర్యటనకు వచ్చినప్పుడు ఏలేరు ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. పాత అంచనాలను సవరించి కొత్తగా సిద్ధంచేసిన రూ.663 కోట్ల అంచనాలకు మోక్షం కలగలేదు. అనేక బడ్జెట్‌లు వెళ్లిపోయినా ఆధునికీకరణకు డబ్బులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలుసార్లు ప్రస్తావించారు. దీంతో ఈ బడ్జెట్‌లో ఈ పనులకు నిధులు ఏమేరకు కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా సవరించిన అంచనాలు రూ.794 కోట్లకు చేరాయి.

డెల్టా..ఆధునికీకరణ సంగతేంటో..

కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన డెల్టా ఆధునికీకరణ సైతం మూలనపడిపోయింది. గడచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు వరదలతో కోనసీమ అతలాకుతలమైంది. ఏటిగట్ల పటిష్టత చేపట్టలేదు.ఇప్పుడు డెల్టా ఆధుని కీకరణకు రూ.వెయ్యి కోట్లపైనే ఖర్చు కానుంది. సెంట్రల్ డెల్టాకు కీలకమైన లొల్ల లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు తక్షణవసరంగా మారింది. రూ.470కోట్లతో ఏలేరు-తాండవ లింకు కాలువ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినా పనులు టెండర్ల దశలోనే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తం 214 కిలో మీటర్లు ఉన్న ఈ కాలువ ద్వారా కాకినాడ జిల్లాలో 1.67 లక్షల ఎకరాలు, కోనసీమ జిల్లాలో 2,326 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 81 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.3,645 కోట్ల పనులకు 72.7 శాతం పనులు పూర్తికాగా వైసీపీ హయాంలో ఎక్కడికక్కడ మిగిలిన పనులు పడకేశాయి. కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచి పూర్తి చేయాల్సి ఉంది.

తల్లికి వందనం.. ఆర్టీసీ ప్రయాణం..

తల్లికి వందనం మే నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధులు అవసరం. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మందికి మేలు కలగనుంది. దీంతో మహిళల్లోనూ బడ్జెట్‌పై ఆసక్తి నెలకొంది.

స్మార్ట్‌సిటీకి నిధులిస్తారా...

కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100 కోట్ల నిధులు ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం కూడా తన వంతు ఏటా ఇంకో రూ.100 కోట్లు సమకూర్చాలి. కానీ వైసీపీ హయాంలో నిధులు విడుదల చేయలేదు. అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు.

కోటిపల్లి కూత పెట్టేనా..

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను జగన్ సర్కారులో కలగా మారింది. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ ఈ లైను పూర్తి చేస్తామని కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రాష్ట్ర వాటా నిధుల కింద కేటాయింపులు జరగాల్సి ఉంది. దీంతో ఎన్ని నిధులు కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి 2001లో భట్నవిల్లి వద్ద శంకుస్థాపన చేసిన ఈ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

సబ్బుపై సీవీ రామన్ చిత్రం

» సోప్ కార్వింగ్ ద్వారా చిత్రించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు




సోప్ కార్వింగ్ కళ ద్వారా సబ్బుపై చెక్కిన సర్ సీవీ రామన్ చిత్రం, చిత్రించిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు సబ్బు బిళ్లపై ఆయన చిత్రాన్ని చిత్రించారు. సోప్ కార్వింగ్ కళ ద్వారా సబ్బు బిళ్లను చెక్కి చిత్రించిన రామన్ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. సర్ సీవీ రామన్ జీవితచరిత్ర గురించివిద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సబ్బుబిళ్లపై ఆయన చిత్రాన్ని చెక్కినట్లు గోవిందరాజులు తెలిపారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం




రథోత్సవంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల.. స్వామి,అమ్మవార్లు



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

» సామర్లకోటలో రథంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు

సామర్లకోట,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామి,బాలాత్రిపురసుందరి అమ్మవార్ల రథోత్సవం గురువారం ఘనంగాజరిగింది. స్వామి,అమ్మవార్లు ఆశీనులు కాగా సర్వాంగ సుందరంగా అలంకరించిన రథం ముందుకు కదిలింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పల్లకిపై గాంధీ బొమ్మసెంటర్‌కు మంగళ వాయిద్యాల మధ్య భక్తులు తీసుకురాగా అప్పటికే రథంపై సిద్ధంగా ఉన్న పండితులు చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్నబాబు, వినయ్‌రథంవేదికపై అలంక రించారు. శాస్త్రోక్తంగా గుమ్మడికాయను అన్నంకుంభంపై పగులకొట్టి హారతులు ఇవ్వగా పెద్దాపురం ఎమ్మెల్యే చిన రాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎమ్మెల్యే రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, తలాటం సూర్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన రథోత్సవంలో వివిధ సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే చినరాజప్ప సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రదర్శనకారులు తమ కళలను ప్రదర్శించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దేవీ ఫిషరీస్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఇంటి ఆవరణలో 5వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం భీమేశ్వరాలయంలో స్వామివారికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు.



ఊరేగింపులో ప్రదర్శనగా విచిత్ర వేషధారణలు

బహుముఖ ప్రజ్ఞాశాలి..
కవిశేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా



» సంఘ సంస్కర్తగా, కవిగా విశిష్టస్థానం
» ఖిలావత్ ఉద్యమంలో కీలకపాత్ర
» జాతీయ శాసన సభలో సభ్యుడు
» నేడు ఆయన 140వ జయంతి

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

ఉన్నత పాఠశాలతోనే విద్యాభ్యాసం ముగిసినా 50కిపైగా పుస్తకాలు రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా. సంఘ సంస్కర్తగా, కవిగా గుర్తింపు పొందిన ఈయన గాంధీ టోపీలతో సాగిన ఖిలావత్ ఉద్యమంలోను కీలకపాత్ర పోషించారు. జాతీయ శాసనసభలో మరణించేవరకూ సభ్యుడిగాఉన్నారు.తన రచనలు,ప్రసంగాల ద్వారా స్వాతంత్ర్య సమరశంఖాన్ని పూరించారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాతిక పీఠం ఆరో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా 140వ జయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా 1885, ఫిబ్రవరి 28న కాకినాడ జిల్లా పిఠాపురంలో మొహిద్దీన్‌బాద్‌షా, చాంద్‌బీబీ దంపతులకు జన్మించారు. తండ్రి వెంట ఉంటూ అరబ్బీ, పర్షియన్, ఉర్దూభాషలు నేర్చుకున్న ఈయన ఉన్నత పాఠశాలతోనే చదువులు ముగించారు. ఉమర్‌ఆలీషా 14వ ఏటనే చందోబద్ధంగా పద్యాలు రాయడంతోపాటు ధారాళంగా కవిత్వాలు చెబుతూ తన వంశ గురువైన అఖైలలీషాను స్తుతిస్తూ బ్రహ్మ విద్యావిలాసం అనే శతకాన్ని రచించారు. 18వఏట గద్య, పద్యాత్మకమైన మణిమాల నాటకాన్ని రాశారు. ఆయన 50కిపైగా గ్రంథాలు, పుస్తకాలను రచించారు. సామాజిక ఆధ్యాత్మిక ప్రయోజనమే లక్ష్యంగా, జాతీయభావం, సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం, సర్వమత సమభావనలతోపాటు సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా, మహిళాభ్యుదయం, ప్రజాచైతన్యాన్ని ఆశిస్తూ రచనలు సాగించారు. పండిత సమ్మేళనాల్లో శతావధానాలు చేశారు.

స్వాతంత్ర సమరయోధునిగా..

జాతీయ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటాలు, ఉద్యమాల్లో ఉమర్‌ఆలీషా పాల్గొన్నారు. మహాత్మా గాంధీతో విజయవాడలో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. 1924లో అఖిలభారత ఖిలావత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ముస్లిం లీగ్ మద్రాసుశాఖ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. గాంధీ టోపీలతో సాగిన ఖిలావత్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 1934 డిసెంబరులో ఉత్తర మద్రాసు నియోజకవర్గం నుంచి జాతీయ శాసనసభ సభ్యుడిగా ఎన్నికై 1945లో మరణించే వరకూ ఆ పదవిలో కొనసాగారు.

పలు పురస్కారాలు, పదవులు

విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆరో పీఠాధిపతిగా 1928లో బాధ్యతలు చేపట్టిన ఆయన మరణించేవరకూ పీఠాధిపత్యం వహించారు. సర్వమతసమభావనా కేంద్రంగా పీఠాన్ని తీర్చిదిద్దారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం సభ్యుడిగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ముస్లిం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా, భారతీయ జాతీయ కాంగ్రెస్ సభ్యుడి గా పనిచేశారు. ఈయనకు 1936లో ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ అమెరికా డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ప్రకటించింది. ఇంకా పలు బిరుదులు, పురస్కారాలు లభించాయి. 1945, జనవరిలో ఢిల్లీ నుంచి తిరిగి వస్తూ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వెళ్లిన ఉమర్‌ఆలీషా జనవరి 23న మరణించారు.

నేడు కాకినాడలో జయంతి సభ

కాకినాడ బోట్‌క్లబ్‌వద్ద శుక్రవారం ఉదయం కవిశేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా 140వ జయంతి సభ నిర్వహించనున్నారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్మాతిక పీఠం కాకినాడశాఖ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అంబరాన్నంటిన సంబరం

» పిఠాపురం పాదగయలో వైభవంగా నాకబలి- దండాడింపు-దొంగలదోపు ఉత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంపాదగయలో గురువారం జరిగిన నాకబలి-దండాడింపు-దొంగలదోపు ఉత్సవం ఉత్సాహపూరితంగా సాగింది. పాదగయలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు జరిపారు. నాకబలి-దండాడింపు-దొంగలదోపుఉత్సవంలో భాగంగా అర్చకులు పరస్పరం రంగులు చల్లుకొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి దేవస్థానం నుంచి ప్రదర్శనగా కుంతీమాధవస్వామి దేవస్థానంవరకూ తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, కింగ్‌కాంగ్ బొమ్మలు, శక్తి వేషధారుల ప్రదర్శనలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాదగయక్షేత్రం నుంచి ఉత్సవమూర్తులను తీసుకువెళ్తున్న పల్లకిని పోలీసులు మోసుకుని తీసుకువెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. పల్లకిని పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్‌లోని ఎస్‌ఐలు, పోలీసులు మోశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు, మునిసిపల్ కమిషనరు కనకారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార బ్రహ్మత్వంలో అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



దొంగలదోపు ఉత్సవంలో రంగులు చల్లుతున్న అర్చకులు

పిఠాపురం పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి రథోత్సవం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్‌దీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కుంతీ మాధవస్వామి కోనేరునుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు.



పిఠాపురం పాదగయ వద్ద శక్తి వేషధారణలో ప్రదర్శనలు

కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీబస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 50-57 ఏళ్ల మధ్య వయస్సున్న మగ వ్యక్తి మృతదేహం ఒంటిపై ఎరుపు, పచ్చ, తెలుపురంగుల గళ్ల చొక్కా, తెలుపు, నీలం రంగు లుంగీ ఉంది. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. వారికి వివరాలు తె లియరాలేదు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 94407966622, 08813-231100, 9154875583 నెంబర్లలో సమాచారం అందజేయాలని సీఐ విశ్వం తెలిపారు.

పీక కోసుకుని యువకుడి ఆత్మహత్య

తొండంగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేటలో గురువారం ఓ యువకుడు మనోవేదనకు గురై పదునైన కత్తితో పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన కుందేటి సత్యన్నారాయణమ్మ తన రెండో భర్తతో తమ్మయ్యపేటలో నివసిస్తోంది. ఆమె కుమారుడు కుందేటి లోవరాజు (28) జనవరి 8న భార్య నాగలక్ష్మి, రెండేళ్ల కుమారుడితో కలిసి తొండంగి మండలం తమ్మయ్యపేట వచ్చి ఉంటున్నాడు. భార్యభర్తలు గొడవపడడంతో ఫిబ్రవరి 6న భార్య పుట్టింటికి మురారి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మనోవేదనకు గురైన లోవరాజు మధ్యాహ్నం 3గంటలవేళ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడాడు. తర్వాత ఫోను తల్లికి ఇచ్చి మేడపైకి వెళ్లాడు. అక్కడ ఉన్న సింటెక్స్ వాటర్ ట్యాంకుకు, గోడకు మధ్య కూర్చుని పదునైన వస్తువుతో పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో లోవరాజు మృతదేహం

ట్రాలీని ఢీకొట్టిన బొలెరో
తృటిలో తప్పిన పెను ప్రమాదం



గండేపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం ప్రకారం హైదరాబాద్‌నుంచి విశాఖపట్నం ములక్కాడ లోడుతో వెళ్తున్న బొలెరో వ్యాన్ ముందు వెళ్తున్న ట్రాలీని ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో అందరూ బయటపడ్డారు. ఒక్కసారిగా వ్యాన్ బోల్తా కొట్టడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన
నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక మహిళను గరికిన మహేష్ అనే యువకుడు 2022లో అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎస్‌ఐ నాగార్జునరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోలీసులు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అనంతరం నిందితుడు మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు రాజమహేంద్రవరం 8వ జిల్లా సెషన్స్ జడ్జి, స్పెషల్ జడ్జి ఫర్ ట్రైల్ ఆఫ్ ఆఫెన్సస్ అగైనెస్ట్ ఉమెన్ కేసులు కోర్టు మెజిస్ట్రేట్ వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగారశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ, సాక్ష్యులను ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుళ్ల ఏవీఎస్ఎన్ మూర్తి, ఎ.వెంకటేశ్వరరావులకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

4 నుంచి 'నన్నయ'లో నారీఫెస్ట్

» మొదటి రోజు మామ్మ-మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు
» క్యాంపస్ మహిళలకు ప్రత్యేకం
» వర్సిటీ అనుబంధ కళాశాలల సిబ్బందికీ పోటీలు
» 6న ఘనంగా వేడుకలు
» ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మార్చి 4 నుంచి మూడురోజులపాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయాలని గురువారం కోరారు.

రాజమహేంద్రవరం పరిసరాల్లో వారు అర్హులు

విశ్వవిద్యాలయంలో నారీఫెస్ట్ పోటీలు ప్రారంభమయ్యే మొదటిరోజు అనగా 4వ తేదీన మామ్మ(అమ్మమ్మ, నానమ్మ)-మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు జరుగుతాయన్నారు. మామ్మ-మనవరాలు ఫ్యాషన్ షో పోటీల్లో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని ఆడశిశువుల నుంచి వృద్ధ మహిళల వరకూ పాల్గొనవచ్చునన్నారు. ఆరోగ్యకరమైన శిశువుల ప్రదర్శనలో ఐదేళ్ల లోపు ఆడ, మగ శిశువులు పాల్గొనేందుకు అర్హులన్నారు. మామ్మ వయస్సు 60 నుంచి 80ఏళ్లు, మనవరాలు వయస్సు 5నుంచి 10ఏళ్ల మధ్య ఉండాలన్నారు. మహిళల్లో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీలో పాల్గొనదలచిన వారు మార్చి 3వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇందుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను గానీ, విశ్వవిద్యాలయ ఉమెన్ సెల్‌ను గానీసంప్రదించాలన్నారు. హెల్దీబేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లకు ఫోన్‌చేస్తే పూర్తి వివరాలు తెలుపుతారన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని విద్యార్థినులకు, సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్యాంపస్ సిబ్బంది, విద్యార్థులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు.

5, 6 తేదీల్లో..

5న నన్నయ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి సృజనాత్మక చేతి పనులు, చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, పూల అలంకరణ వంటి వివిధ పోటీలు విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం కుటుంబానికి చెందిన మహిళా సభ్యులు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 6న విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని వీసీ తెలిపారు. పోటీల్లో విజేతలకు నారీఫెస్ట్ కార్యక్రమంలో జ్ఞాపికలను, ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. ఈ వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, మహిళలు ప్రదర్శిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలు విశ్వవిద్యాలయం మహిళా విభాగం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మహిళలందరూ ఈ కార్యక్రమాలకు హాజరై నారీఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు సెలవు దినాలుగా ప్రకటించాలి

ఏపీ ఎన్జీజీవోస్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించేందుకు 5,6 తేదీల్లో సెలవు దినాలుగా ప్రకటించాలని ఏపీఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా క్రీడా మైదానంలో జరిగే ఈ ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

యానాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యానాం శివారు సావిత్రినగర్‌కు చెందిన యువకుడు పట్టా మోహన్(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యానాం సావిత్రినగర్‌లో ఉంటున్న మోహన్ చెడు అలవాట్లకు బానిసై అతడి మానసిక స్థితి పరిస్థితి బాగాలేదు. కుటుంబ వివాదాల నేపథ్యంలో తండ్రి ధర్మరావు ఏటిమొగలోను, తల్లి రమణ సావిత్రినగర్‌లోను ఉంటున్నారు. అతడు ఇంటికి వెళ్లకుండా తాను పనిచేస్తున్న బోటు వద్దే ఉంటున్నాడు. మానసికంగా సరిగా లేకపోవడంతో మోహన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు. యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రసవత్తరంగా సాగిన సెమీఫైనల్స్

» ముగింపు దశకు చేరుకున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



సెమీఫైనల్స్‌లో తలపడుతున్న ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ మహిళల జట్లు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ముగింపు దశకు చేరుకుంది. గురువారం వివిధ రాష్ట్రాల మహిళల, పురుషుల మొత్తం నాలుగు మ్యాచ్‌లు సెమీఫైనల్లలో తలపడ్డాయి. హాకీ టోర్నమెంట్ కన్వీనర్ రాజ్‌కుమార్‌వర్మ, జిల్లా అటవీశాఖఅధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీకోచ్ రవిరాజు పాల్గొన్నారు. ఒడిస్సాసెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, హర్యానా సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఒడిస్సా సెక్రటేరియట్ పురుషల జట్ల మధ్య సెమీఫైనల్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 8-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, హర్యానా సెక్ర టేరియట్ పురుషులజట్ల మధ్య సెమీఫైనల్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 5-0తేడాతో విజయం సాధించింది.

క్రీడాకారులు ఎంతో నేర్చుకుంటారు



ఇటువంటి జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరుగుతూ ఉంటే వాటిని చూసి ఎంతోమంది క్రీడాకారులు ప్రేరణ పొందుతారు. సరైన సమయంలో శిక్షణ ఇస్తే భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా తయారవుతారు. నేను ఇలాంటి ప్రేరణతోనే ఇండియాజట్టు సభ్యుడిగా ఏషియన్ గేమ్స్‌లో హాకీ వరల్డ్‌కప్ ఆడగలిగాను. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి.

-ధనుంజయ్ మహాడి, అంతర్జాతీయ క్రీడాకారుడు, జీఎస్టీ, డిప్యూటీ కమిషనరు, మహారాష్ట్ర

కాకినాడలో మెరిసిన అంతర్జాతీయ క్రీడాకారులు



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి టోర్నమెంటుకి కాకినాడ వేదిక కావడంతో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు, ఆయా రాష్ట్రాల నుంచి వారి ప్రోత్సాహకులు కాకినాడ జిల్లా క్రీడా మైదానానికి తరలివస్తున్నారు. అంతర్జాతీయ టోర్నీల్లో వివిధ విభాగాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఒకేచోట కలవడంతో వారి క్రీడా విశేషాలను పంచుకున్నారు. ఇంటర్నేషనల్ హాకీ ప్లేయర్ సోనికా(ఇన్‌కం ట్యాక్స్ సూరింటెండెంట్ ఢిల్లీ), ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ చెరుకూరి పూర్ణిమ (ఇన్‌కం ట్యాక్స్ సూరింటెండెంట్ హైదరాబాద్, తెలంగాణ), ఇంటర్నేషనల్ అథ్లెట్ ఫిరోజ్ భాను (ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్, తెలంగాణ).. వీరు ముగ్గురూ హాకీ గ్రౌండ్‌లో మెరవడంతో అక్కడున్న క్రీడాకారులు వారిని ఆప్యాయంగా పలకరించి కాసేపు సరదాగా గడిపారు.

క్రీడలతోనే మంచి భవిష్యత్



1994లో స్పోర్ట్స్ కోటాలో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంట్‌లో యూడీసీగా చేరాను. ఇప్పుడు ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. ఆర్ఎస్‌బీ హైదరాబాద్ హాకీ టీం మేనేజరుగా కొనసాగుతున్నాను. క్రీడాకారులు ఆటపట్ల అంకితభావంతో ముందుకెళ్తే స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగంతో స్థిరపడే అవకాశముంది. క్రీడాకారులు ఇటువంటి టోర్నీల ద్వారా ప్రేరణ పొంది చక్క గా రాణించాలి.

-పి.వెంకటేశులు, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్, ఆర్ఎస్‌బీ హైదరాబాద్ టీం మేనేజరు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లవిల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీలు రెండోరోజుకు చేరుకున్నాయి. టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఈ టోర్నీని ఇటీవల మరణించిన క్రీడాకారుడు, అంతర్జాతీయ షటిల్ ఆటగాడు సాత్విక్ తండ్రి రంకిరెడ్డి కాశీవిశ్వనాథానికి అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. గురువారం మొదటి మ్యాచ్ హూపర్స్ క్లబ్(ముంబై), కేరళ స్పైకర్స్ మధ్య జరిగింది. నువ్వా.. నేనా అన్నట్టు జరిగిన మ్యాచ్‌లో బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో 3-2 తేడాతో హూపర్స్ క్లబ్ విజేతగా నిలిచింది. అనంతరం ఐటీ(చెన్నై), జీఎస్టీ(ముంబై) జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగుతోంది. అంతర్జాతీయ రిఫరీ ఎం.డానియేలు, జాతీయ రిఫరీలు నాగేశ్వరరావు, శివగిరి, ఎల్.జార్జి, ఆర్.సురేష్ సారథ్యంలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో టోర్నీ కార్యవర్గం, వలంటీర్లు వీక్షకులకు అవసరమైన వసతి కల్పిస్తున్నారు. అధికసంఖ్యలో మహిళలుపోటీలను వీక్షించేందుకు తరలివచ్చారు.



హూపర్స్ క్లబ్, కేరళ జట్లు తలపడుతున్న దృశ్యం

క్రికెట్ కిట్లు పంపిణీ

కొత్తపల్లి, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): కొమరగిరిలో నిర్వహించిన నాగేంద్ర, వీరబాబు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడాకారులకు కాకినాడకు చెందిన శ్రీసాయి ఆయి ల్స్ అధినేత తలిశెట్టి బుల్లీస్‌కుమార్ గురువారం క్రికెట్ కిట్లను అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు విద్యతోపాటు వివిధ క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని బుల్లీస్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. క్రీడాకారు లకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



పిఠాపురంలో రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి రథోత్సవం

వైభవంగా కుక్కుటేశుని రథోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి రథోత్సవం గురువారంరాత్రి కన్నుల పండు వగా జరిగింది. విద్యుత్ దీపాలతో అలంక రించిన రథంపై ఉత్సవమూర్తులను ఉంచి కుంతీ మాధవస్వామి కోనేరునుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు. అక్కడ భారీగా బాణాసంచాకా ల్చారు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూ ర్తులను పల్లకీపై ఉంచి పాదగయ నుంచి నాయకులు, అధికారులు పల్లకీని మోస్తూ కుంతీ మాధవస్వామి దేవ స్థానం మీదుగా కోనేరు వరకూ తీసుకొచ్చారు. రథోత్సవాన్ని భక్తులు భారీగా తరలివచ్చారు. రథోత్సవంలో ఆల య కార్యనిర్వహణాధికారి కాట్నంజగన్మోహన శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామ్మోహనరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరుడికి పుష్పాలంకారం

గొల్లప్రోలురూరల్ : గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి బుధవారం అర్ధరాత్రి, గురువారం ఉదయం అభిషేకాలు జరిగాయి. గణపతిపూజ, మహాన్యాస పారాయణ గావించి 121 రుద్రములు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలు, రజత ఝుటారుఝాట ముతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో ఉమారామలింగేశ్వరస్వామి

లింగోద్భవ కాలపూజ

● భారీ ఎత్తున ప్రసాదాల వితరణ

సామర్లకోట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని గురువారం తెల్లవారుజాము వరకూ లింగోద్భవ కాలపూజలు సామర్లకోట కుమార రామ భీమేశ్వరుడి శివలింగానికి ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబుచే దేశంలోని 12ప్రముఖ నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో శివలింగానికి అభిషేకపూజలు నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు నిర్విరామంగా జరిగిన అభిషేకపూజల అనంతరం బంగారపు ఆభరణాలు, నూతన పట్టు వస్త్రాలతో స్వామివారిని సర్వాంగసుందరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. ఆలయ ఆవరణ కిక్కిరిసి ఉం డడంతో లింగోద్భవ కాలపూజలను తిలకించేందుకు ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్ల వద్ద భక్తులు తిలకించారు. చీఫ్ ఫెస్టివల్ అధికారి తలాటం సూర్యనారాయణ, ధర్మ కర్తల మండలి మజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్(బాబు), భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విశేష అలంకారంలో స్వామివారు

ఘనంగా రుద్రాభిషేక హోమం

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం గాయత్రి బ్రాహ్మణ భవన్‌లో మహాశివరాత్రి పురస్కరించుకుని దేవరభట్ల భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు శివుడిని ప్రార్థిస్తూ ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం శివుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని కోరుతూ మహా రుద్రాభిషేక హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు వీవీఎస్ ప్రకాశ్‌రావు తెలిపారు. శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన శివరాత్రి పర్వదినానఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టడం అందరికీ మంచి జరుగుతుందన్నారు. అనంతరం పూ ర్ణాహుతి నిర్వహించిన తర్వాత భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వారణాసి నారాయణ, ఐటీవి మూర్తి, ఆకెళ్ల ప్రసాద్, రమణ మూర్తి, సత్యలక్ష్మి, కృష్ణకుమార్ పాల్గొన్నారు.



రుద్రాభిషేక హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా లక్ష రుద్రాక్ష అభిషేకం

కాకినాడసిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ న్యూపోర్టు రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రసిద్ధ శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు మహాశివరాత్రి లింగోద్భవ సువర్ణ జల పాశుపత లక్ష రుద్రాక్షాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గరిమెళ్ల లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష రుద్రాక్షలతో అభిషేకం చేశారు. శివనామస్మరణ మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ దాత మల్లవరపు సత్యనారాయణ కుటుంబ సభ్యులతో లక్ష రుద్రాక్షాభిషేకంలో పాల్గొన్నారు. ప్రముఖ కవి డాక్టర్ వేదుల శ్రీరామ శర్మరుద్రాక్ష అభిషేక మహత్యాన్ని వివరించారు. అరుణాచలంలో జరిగే జ్యోతి దర్శనం మాదిరిగానే భక్తులందరికీ అఖండ జ్యోతి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వెంకటేశ్వరనగర్ కాలనీ అసోసియేసన్ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కాశీ విశ్వేశ్వరుడికి లక్ష రుద్రాక్షలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

నాగులాపల్లి పీహెచ్‌సీలో అందని వైద్యసేవలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నాగులాపల్లి ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో రోగులకు సరైన వైద్యసేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీపీ, షుగర్ వ్యాధులతో ఆసుపత్రికి రోగులకు ఎటు వంటి పరీక్షలు చేయకుండా పంపేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బీపీ పరీక్ష చేయడానికి మిషన్ పనిచేయడం లేదని, సాకులు చెబుతున్నారని వాపోతున్నారు. అదే విధంగా గాయాలు తగిలి చికిత్స కోసం ఆసుపత్రికి వెళితే కట్టువేయడానికి సాయంత్రం రమ్మని చిరాకుగా వ్యవహరిస్తున్నారని జి. సత్యనారాయణ ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆసుపత్రి ఉన్నా వేరేచోటకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదనవ్యక్తం చేశారు. పీహెచ్‌సీకి వివిధ రోగాలు నయం చేసుకునేందుకు వచ్చేవారికి నాణ్యమైన వైద్య సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

- ఓటు వినియోగించుకున్న గ్రాడ్యుయేట్లు
- క్యూలైన్లలో వేచిఉన్న ఓటర్లు
- రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- పోలీస్‌బందోబస్తు మధ్య ఏర్పాట్లు
- కాకినాడ రూరల్లో 62.9 శాతం పోలింగ్





సర్పవరంలో ఓ పోలింగ్ బూత్ వద్ద ఓటేయడానికి బారులుదీరిన ఓటర్లు, కొత్తపల్లిలో ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఏఎస్పీ దేవరాజ్ మనిష్‌పాటిల్

సర్పవరంజంక్షన్, కాకినాడరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. 62.9శాతం ఓట్లు పోలయ్యాయి. కాకినాడ రూరల్ మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 10,499మంది ఉండగా, 13 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో 10,499 మంది ఓటర్లు ఉండగా 6,604 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 3,754 కాగా, మహిళలు 2,850మంది ఓటువేశారు. మొ త్తంగా పోలింగ్ ముగిసే సరికి 62.90 శాతం ఓట్లు పోలైనట్లు మండల తహశీల్దార్ ఎస్ఎల్ ఎన్ కుమారి తెలిపారు. ఏపీఎస్పీ, వాకలపూడి, ఇంద్రపాలెం, తూరంగి పోలింగ్ కేంద్రాలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లిసత్యనారాయణమూర్తిలు సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించా రు. అలాగే ఏపీఎస్పీ, వాకలపూడి పోలింగ్ కేం ద్రాలను పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు సందర్శించారు. ఇంద్రపాలెం పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారి,ఆర్డీవో మల్లిబాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలవద్ద రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రవాణా ఖర్చులు ఇవ్వకపోవడంపై నిరసన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఓటర్లకు నాయకులు దారిఖర్చులు ఇవ్వకుండా మొహం చాటేయడంపట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేశా రు. ఎన్నికల ముందురోజు ఫోన్లు చేసి, ఓటేసేందుకు రావాలి, రానుపోనూ దారిఖర్చులు ఇచ్చేస్తామంటూ హామీఇచ్చి, తీరా ఓటువేసేందుకువస్తే, సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడంతో నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. మంచి పద్ధతి కాదంటూ ఆక్రోశం వెళ్లగక్కారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఎమ్మెల్యే

కాకినాడసిటీ: కాకినాడ సిటీ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఎన్డీఏ శ్రేణులతో కలిసి గురువారం సంద ర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ జరుగుతున్న తీరును ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకున్నారు.క్లస్టర్, యూనిట్, డివిజన్‌స్థాయి నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురంలో 66.56 శాతం

పిఠాపురం: పిఠాపురంలో ఎమ్మెల్సీ ఎన్ని కల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మునిసిపల్, మండలపరిషత్, వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ఆరు పోలింగ్ కేంద్రాల్లో 4,300మంది ఓటర్లకుగానూ 2,862 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం 66.56గా నమోదైంది. పోలి ంగ్ జరుగుతున్న తీరుని కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, తహసీల్దారు వీవీ గోపాల కృష్ణ, సీఐ శ్రీనివాస్ పర్యవేక్షించారు. పోలి ంగ్ జరుగుతున్న తీరు, సరళిపై పిఠాపురం మా జీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు పరిశీలించి ఆరా తీశారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో 68.90శాతం ఓటింగ్ నమోదైంది. 1836మంది ఓటర్లకుగానూ 1265 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. పో లింగ్ జరుగుతున్న తీరుని అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, తహసీల్దారు సత్యనారాయణ పరిశీలించారు.

కొత్తపల్లిలో 72.37 శాతం పోలింగ్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నిక 72.37శాతం పోలింగ్‌తో ప్రశాంతంగా జరిగింది. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో టెలీకాన్ఫరెన్స్ హాలులో 1, ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. కొత్తపల్లి మండలంలో 1824 ఓట్లకుగాను 1320 పట్టభద్రులు తమఓటు హక్కును వినియోగించుకున్నట్టు తహసీల్దార్ జి. చిన్నారావు చెప్పారు.కాకినాడజిల్లా ఏఎస్పీ మనిష్ దేవరాజ్‌పాటిల్ కొత్తపల్లిలో మూడు కేంద్రాల్లో పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జి.వెంకటేష్ ఏఎస్పీ వెంట ఉన్నారు.

కరపలో 71.63 శాతం

కరప: కరప ఎంపీపీ పాఠశాలలోని 143 పోలింగ్ కేంద్రం, కరప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని 141, 142 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మండలంలో 2,457మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుండగా వారిలో 1,760మంది (71.63 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఏఎస్పీ దేవరాజ్ పాటిల్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడరూరల్ సీఐ చైతన్య కృష్ణలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎస్ఐ తోట సునీత, ఎన్నికల అధికారులు బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను కాకినాడ కలెక్టరేట్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, పార్టీ కాకినాడజిల్లా ప్రధానకార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, జనసేన నేత పంతం సందీప్‌లు కూటమి నాయకులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు.

సామర్లకోటలో 65.50 శాతం పోలింగ్

సామర్లకోట: సామర్లకోట మండలం పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలలో సాయం త్రం 65.50 శాతం పోలింగ్ నమోదైంది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నతపాఠశాల పోలింగ్‌బూత్‌లో తన కుమారుడు రంగనాగ్‌తో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి ఎమ్మెల్యే చినరాజప్ప సామర్లకోట పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. సామర్లకోటలో 101 పోలింగ్ బూత్‌లో పోలింగ్ ముగిసే సమయానికి ఇంకా ఓటర్లు వరుసలలో ఉండిపోవడంతో తలుపులు వేసి లోపల ఉన్నవారికి స్లిప్‌లు అందజేసి సుమారు 75 నిమిషాల పాటు పోలింగ్ ప్రక్రియ కొనసాగించారు. పోలింగ్ ప్రక్రియను పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గిడ్ల వీరరాఘవులు స్థానిక సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. సామర్లకోట మండలం, పట్టణం పరిధిలో 2,538 పురుషులు, 1,752 మహిళా ఓటర్లకుగాను సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 1,736 పురుషులు, 1,074 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెద్దాపురంలో 68.28 శాతం

పెద్దాపురం: స్థానిక మహారాణి కళాశాలలో నాలుగు బూత్‌లు, లూథరన్ హైస్కూల్లో రెండు బూత్‌లను ఓటు వేసేందుకు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల సమయానికి 45.58 శాతం నమోదు కాగా సాయంత్రం నాలుగు గంటల సమయానికి 68.28 శాతంగా పోలింగ్ నమోదైంది. 3802 మంది ఓటర్లకుగాను 2596 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ఆర్డీవో కె.శ్రీరమణి, ట్రైనీ కలెక్టర్ భావన, తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి పరిశీలించారు.



పోలింగ్ సరళని పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

పోలింగ్ సరళని పరిశీలించిన ఆర్డీవో మల్లిబాబు

కాకినాడసిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాకినాడలోని ఆర్అండ్‌బీ, జడ్పీ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని గురువారం కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆర్అండ్‌బీ కార్యాలయ పోలింగ్ కేం ద్రంలో ఆర్డీవో ఓటుహక్కు వినియోగిం చుకున్నారు. శ్రీనగర్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కాకినాడఅర్బన్ తహసీల్దార్ వి.జి తేంద్ర పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



ఏపీఎస్పీలో పోలింగ్ కేంద్రానికి వెళుతోన్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు



ఏపీఎస్పీలో పోలింగ్ సరళిపై మాట్లాడుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ, కుడుపూడి సత్తిబాబు



పెద్దాపురం మహారాణీ కళాశాలలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు

దువ్వాడ మానసిక స్థితి సరిగా లేదు

● కుడా చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత దువ్వాడ శ్రీనివాస్ మానసిక స్థితి సరిగ్గా లేదని కుడా చైర్మన్ తుమ్మల రామా స్వామి(బాబు) అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై దువ్వాడ చేసిన అనుచిత వ్యాఖ్య లను ఆయన ఖండించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. వైసీపీలో మనుగడ లేకపోవడంతో రాజకీయ మైలేజ్‌ను పెంచుకునేందుకు దువ్వాడ పవన్‌పై ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. శ్రీకాకు ళం నుంచి హైదరాబాద్‌కు తన ప్రియురాలితో వెళ్లి చీరలు అమ్ముకుంటున్నాడని విమర్శించా రు. రాజకీయ విమర్శలు మానుకుని ప్రియు రాలిని కాపాడుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పొలమరశె ట్టి సత్తిబాబు, కఠారి శ్రీను, మంచెమ్ సాయిబాబు, లక్ష్మణ దివాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న కుడా చైర్మన్ తుమ్మల బాబు

నేడు పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు పురపాలకసంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో జరుగుతున్న మునిసిపల్ కమిషనరు నామా కనకారావు తెలిపారు. ఛైర్‌పర్సన్ గండేపల్లి సూ ర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాతో పాటు సభ్యులు ప్రస్తావించే అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు గొల్లప్రోలు నగరపంచాయతీ సమావేశం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని కమిషనర్ కనకారావు తెలిపారు. ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన నగరపంచాయతీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో అజెండాతోపాటు సభ్యులు ప్రస్తావనకు తీసుకువచ్చే అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులతో పాటు అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

చిత్రాడ యువతి చికిత్సకు రూ.7లక్షలు

● సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు

పిఠాపురంరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్ర జ్యోతి): యువతి వైద్యానికి అయ్యే ఖర్చులకుగానూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.7 లక్షలు మంజూరయ్యాయి. పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన సానా దుర్గ వెంకటలక్ష్మి కొంతకాలంగా తకయాసు ఆర్థరైటీస్‌తో బాధపడుతున్నారు. ఈ వ్యాధికి చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన చొరవ తీసుకు ని వైద్యఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.7లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను గురువారం మధ్యాహ్నం శాసనమండలి ఆవరణలో వెంకటలక్ష్మి సోదరుడు ఆదిత్యకు ప్రభు త్వ విప్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో తమ సోదరికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.7లక్షలకు ఎల్‌వోసీ మంజూరైందని, మాకుటుంబం తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆదిత్య తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.7లక్షల ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్



గొర్రిపూడిలో ట్యాంకర్లోకి బోరు నీటిని నింపుతున్న దృశ్యం

తెగ తోడేస్తున్నారు..!

- ఇబ్బడిముబ్బడిగా బోర్లు ● వాల్టా చట్టానికి తూట్లు
- అడుగంటికిపోతున్న భూగర్భజలాలు ● పట్టించుకోని అధికారులు

కరప, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అనాధికారికంగా బోర్లు ఏర్పాటుచేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. ఇబ్బడిముబ్బడిగా వెలసిన బోర్ల నుంచి నీటిని తవ్వి ట్యాంకర్ల ద్వారా హోటళ్లు, పరిశ్రమలు, మత్స్య సంపదశుద్ధికి తరలిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ భూగర్భజలాలను విక్రయించే దందాకు పాల్పడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఫలితంగా భూగర్భ జలాలు హరించుకుపోయి గ్రామాల్లో ప్రజలు నీటికొరతను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను ఉల్లంఘించడంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. కరప మండలం నడకుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, పెనుగుదురు, తదితర గ్రామాల్లో పలు బోర్లు వెలిశాయి. వీటిలో పలు బోర్లకు ఎటువంటి అనుమతులు లేనట్లు తెలుస్తుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు అక్రమ నీటి దందాకు తెరలేపారు. ఆయా బోర్ పాయింట్‌ల నుంచి నిత్యం వేలలీటర్ల భూ గర్భ జలాలను ట్యాంకర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము లు చేసుకుంటున్నారు. గొర్రిపూడిలో ఇబ్బడిముబ్బడిగా బోర్లను తవ్వి అక్రమంగా నీటిని అమ్ముకుంటున్నారు. ఇక్కడి నుంచి సమీపంలోని ఒక ప్రైవేట్ కళాశాలకు, పరిశ్రమలకు నిత్యం వందలు, వేల గ్యాలెన్ల నీటిని తరలించేస్తున్నారు. గురజనాపల్లి రోడ్‌లో ఒక బోరు పాయింట్ నుంచి సమీపంలోని ఒక రొయ్యల శుద్ధి కర్మాగారానికి ట్యాంకర్ల ద్వారా భారీగా నీటిని తరలించేవారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచిన ఆ పరిశ్రమను అధికారులు సీజ్‌చేయడంతో ప్రస్తుతం ఆ బోరు నీటిని వేరే అవసరాలకు మళ్లిస్తున్నట్టు తెలిసింది. నడకుదురు ప్రధానరహదారి చెంతనున్న ఒక బోరు పాయింట్ నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్యాంకర్లు నీటిని పట్టుకెళ్తున్నాయి. ఈ నీటిని ఎక్కడకు, ఏ అవసరాలకు తరలిస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇవేగాక జిల్లాలోని కొన్ని అనాధికారిక బోర్ల నుంచి భారీస్థాయిలో భూగర్భ జలాలు తరలిపోతున్నాయి. ఈ అక్రమ బోర్ల వల్ల రోజురోజుకు భూగర్భ జలాల మట్టం పడిపోతుందని, దీనివల్ల భవిష్యత్ తరాలు నీటి ముప్పును ఎదుర్కోక తప్పదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పంచాయతీ, భూగర్భ జలశాఖాధికారులు స్పందించి నీటివనరులను హరించేస్తున్న ఈ అక్రమ బోర్లపై ఉక్కుపాదం మోపాలని పలువురు గ్రామస్తులు విజ్ఞప్తిచేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

తునిరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వీరభద్రరావు తెలిపారు. వార్పుపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గొల్లపేట, దివానంపేట, బడావీధి, వెంకటేశ్వరస్వామి, టెంపుల్ ఏరియా వీధి, బంగారమ్మ వీధి, పాతబజారు వీధి, బెల్లపు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

గజ్జనపూడిలో శివాలయాల గిరి ప్రదక్షణ

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): గజ్జనపూడిలో శివరాత్రి ముగింపు సందర్భంగా గురువారం శివాలయాల గిరి ప్రదక్షిణ జరిపారు. శరభవరం, గజ్జనపూడి, కొత్తూరు భక్తులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఏజెన్సీలో ఎమ్మెల్సీ ఎన్నికలు

● రెండు డివిజన్లలో 77.90 శాతం నమోదు

● రంప సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ

రంపచోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ తెలిపారు. రెండు డివిజన్ల పరిధిలోని 12 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 4,668 ఓటర్లకు 3,637 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ 77.90 శాతం నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, సీడీపీవో సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్లు సత్యనారాయణ, జిలానీ, ఆర్ఐ నిర్మలకుమారి వున్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

మోతుగూడెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయి జిల్లా పరిషత్ హైస్కూల్లో 25 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట డొంకరాయి ఎస్ఐ శివకుమార్, పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ సిబ్బంది వున్నారు.

మారేడుమిల్లిలో 84 శాతం పోలింగ్

మారేడుమిల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 84శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దారు టి.బాలాజీ తెలిపారు. 258 ఓట్లకు 216 ఓట్లు పోలయ్యాయి. స్థానిక నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఆయన ఎస్ఐ షేక్ సాదిక్‌తో కలిసి పరిశీలించారు. ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ కూడా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఎటపాకలో 70.73 శాతం పోలింగ్

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ఎటపాకలో మండలంలో 70.73 శాతం పోలింగ్ నమోదైంది. 386 మందికి 273 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దేవీపట్నంలో 75.34 శాతం

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట హైస్కూలు పోలింగ్ కేంద్రంలో 430మంది ఓటర్లకు 324 మంది ఓట్లు వేయగా 75.34 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దారు కె.సత్యనారాయణ, ఎన్నికల అధికారి సురేష్ తెలిపారు. ఎస్ఐ షరీఫ్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారి, సీడీపీవో డి.సంధ్యారాణి, ఎస్ఐ షరీఫ్, ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సులను ఆర్టీసీ బస్సులో రంపచోడవరం తరలించారు. ఎంపీడీవో డీఎన్ రత్నకుమారి, వీఆర్వో ఉదయ్‌కాంత్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చింతూరులో 80.15 శాతం

చింతూరు (ఆంధ్రజ్యోతి): చింతూరులో 388 మంది ఓటర్లకు 311 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.15 శాతం పోలింగ్ నమోదైంది.

వై.రామవరంలో 80శాతం

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): వై.రామవరం ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల సహాయ అధికారి, తహసీల్దారు వేణుగోపాల్ పరిశీలించారు. మండల దిగువన 80శాతం, ఎగువన డొంకరాయిలో నూరు శాతం పోలింగ్ జరిగిందని సెక్టోరియల్ అధికారి, ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు. పోలింగ్ నిర్వాహణలో పీవో ఆర్.వెంకటసత్యనారాయణ, ఏపీవో కె.కృపావరం, ఓపీవోలు భార్గవ్‌చరణ్, విఘ్నేష్ పాల్గొన్నారు. సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కూనవరం హైస్కూల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 458 ఓట్లకు 357 ఓట్లు పోలయ్యాయి.

అడ్డతీగలలో 79శాతం ఓటింగ్ నమోదు

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల జిల్లా పరిషత్ స్కూల్లోని పోలింగ్ కేంద్రంలో 475 మందికి 377 మంది ఓట్లేశారు. పోలింగ్ 79.37 శాతం నమోదైంది.

రాజవొమ్మంగిలో 75.37శాతం

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు అల్లు సత్యనారాయణ పర్యవేక్షణలో స్థానిక ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ జరిగింది. 75.37 శాతం మంది ఓట్లేశారని ఎన్నికల అధికారి చక్రధరరావు తెలిపారు. రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ నరసింహమూర్తి భద్రతా చర్యలు చేపట్టారు. సెక్టార్ అధికారి తూము సూరయ్యరెడ్డి, రూటు ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, కోటేశ్వరరావు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం: ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సొంత మండలమైన రాజవొమ్మంగిలో సాధారణ ఓటరువలే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని పేర్కొన్నారు.



దేవీపట్నంలో బ్యాలెట్ బాక్సులను రంపచోడవరం తరలిస్తున్న దృశ్యం



రాజవొమ్మంగిలో ఓటింగ్ జరుగుతున్న దృశ్యం, మారేడుమిల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్, ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

రంప శివాలయంలో ఏఎస్పీ పూజలు

రంపచోడవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రంప శ్రీభ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఏఎస్పీ జి.సాయిప్రశాంత్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో అర్చకుడు ప్రసన్నకుమార్‌శర్మ అభిషేకం చేయించి ప్రసాదం అందజేశారు.



రంప శివాలయంలో పూజలు చేస్తున్న ఏఎస్పీ సాయిప్రశాంత్ దంపతులు



ఏలేశ్వరం మండలం రమణయ్యపేట పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



కిర్లంపూడిలోని పోలింగ్ కేంద్రం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ప్రత్తిపాడులో 19వ పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు



గండేపల్లిలో ఓటు వేసిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయితేజ్, మాధురి దంపతులు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆయా మండలాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయంలో, మండలంలో యర్రవరం ప్రాథమిక పాఠశాల, రమణయ్యపేట ఎంపీపీ పాఠశాలలో గురువారం నిర్వహించిన పోలింగ్ కేంద్రాల్లో 1929మంది పట్టభద్రులకు 1442 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఇన్‌చార్జ్ తహశీల్దార్ కుశరాజు పరిశీలించారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో 1899 ఓట్లకుగాను 1300 ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. 70.51శాతం పోలింగ్ నమోదైంది. జగ్గంపేటలో 13, 14, 15 బూత్‌ల్లో ఎన్నికల శిబిరాలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సందర్శించారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పలు కేంద్రాలను సందర్శించారు.

కోటనందూరులో...

కోటనందూరు(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో 77.7శాతం ఓటింగ్ నమోదైంది. 25 కేంద్రాల్లో 528 ఓట్లు, 26 కేంద్రాల్లో 382 ఓట్లు నమోదయ్యాయి.

శంఖవరంలో...

శంఖవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు కేంద్రాల్లో 876 ఓట్లకుగాను 621మంది పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 70శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే పర్వత సత్యప్రభ పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆమె వెంట సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, వెన్నా శివ, కీర్తి వెంకటసుభాష్ పాల్గొన్నారు.

కిర్లంపూడిలో...

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 1458ఓట్లకుగాను 917 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 62.89శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ తెలియజేశారు. కిర్లంపూడి పోలింగ్ కేంద్రాలవద్ద జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పర్యవేక్షించారు.



తునిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): మండలంలో 1243మంది పట్టభద్రుల ఓటర్లకుగాను వీరిలో 934మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 75.14శాతం పోలింగ్ నమోదైంది. తహసీల్దార్ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని ఆమె పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ భావన, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం బందోబస్తు నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు, గంటా నూకరాజు, జనసేన, బీజేపీ ఇన్‌చార్జ్‌లు వరుపుల తమ్మయ్యబాబు, సింగిలిదేవ్ సత్తిరాజు పాల్గొన్నారు.

గండేపల్లిలో..

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలో 1337మంది ఓటర్లకుగాను 1017 మంది ఓటు వేయగా 76.7శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ జీవీ భాస్కరరావు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే పరిశీలించారు. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు బందోబస్తు నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, మాధురి దంపతులు, యువ నాయకులు జాస్తి వసంత్ దంపతులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

తునిలో...

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): తునిలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో 3,481మంది ఓటర్లకుగాను 2482మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్‌శాతం 71.3గా నమోదైంది. తునిలో పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే యనమల దివ్య పరిశీలించారు. ఆమె వెంట స్థానిక నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని ఉన్నారు.

తొండంగిలో..

తొండంగి(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 1852 ఓట్లకుగాను 1184 ఓట్లు పోలై 63.93శాతం పోలింగ్ నమోదైంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు మండల రెవెన్యూ కార్యాయలంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీసీవై పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ అనూషా యాదవ్ ఓటుహక్కు వినియోగించుకున్నారు.



జగ్గంపేటలో పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



లింగోద్భవ పూజలు చేస్తున్న దృశ్యం

శివాలయంలో అభిషేకం పూజలు

కోటనందూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి సందర్భంగా కేవో అగ్రహారంలోని శ్రీ విజ్ఞాన శంకర స్వామి ఆలయంలో అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శివుడికి భస్మాభిషేకం పూజారిదుర్గా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కోటనందూరు, అల్లిపూడిలో రుద్రాభిషేకం చేశారు.



పెరుమాళ్లపురం వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

భక్తి, శ్రద్ధలతో మహాశివరాత్రి పుణ్యస్నానాలు

తొండంగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా గురువారం పెరుమాళ్లపురం సముద్రతీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం రాత్రి తీరంలో ఉన్న జగన్నాథస్వామి ఆలయంవద్ద జాతర నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పుణ్యస్నానాలు చేశారు.

'ఆదిత్య'లో శివరాత్రి వేడుకలు

గండేపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలోని ఆధ్యాత్మిక ప్రాంగణంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఆదిత్య అధినేతలు డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం బిల్వార్చన, కుంకుమార్చన, పుష్పార్చన, నీరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆదిత్య అధినేతల కుటుంబసభ్యులు, విద్యార్థులు, ఆలయ అర్చకులు శ్రీరామశర్మ, ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.



ఆదిత్యలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఆదిత్య చైర్మన్ దంపతులు

'చెత్త నుంచి సంపద సృష్టించాలి'

శంఖవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించేలా ప్రతి పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని, తడిపొడి చెత్త వేర్వేరుగా తీసుకురావాలని పెద్దాపురం డీఎల్‌పీవో ఎం.బాలామణి అన్నారు. మండలంలోని వేళంగి, పెదమల్లాపురం, ఎస్.జగ్గంపేట, కొంతంగి, మండపం గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈవోపీఆర్డీ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు అప్పలరాజు, భవాని శంభరుడు, జయలక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.



కొంతంగిలో షెడ్ పరిశీలిస్తున్న డీఎల్‌పీవో బాలామణి

తుని అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుదాం

ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తుని అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ఇటీవల వైసీపీనుంచి టీడీపీలోకి చేరిన తుని మున్సిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా తేటగుంట క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ తుని పట్టణంలో ప్రజా అవసరాలను గుర్తించాలని, ఈ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలు ప్రజాప్రతినిధులుగా తమపై ఉంచిన బాధ్య తను చిత్తశుద్ధితో నిర్వర్తిందామన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు తనతో కలిసి నడవాలని కౌన్సిలర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన కౌన్సిలర్లతో ఎమ్మెల్యే యనమల దివ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర విజయం తథ్యం

ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం తథ్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్న ప్రతిఒక్క పట్టభద్రుడికి టీడీపీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, సుంకవిల్లి రాజు పాల్గొన్నారు.



ప్రణవిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

యడ్లపల్లి ప్రణవికి సత్కారం

జగ్గంపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న విజయవాడలో రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో 361మంది చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఇవ్వగా ప్రథమ బహుమతి సాధించిన జగ్గంపేటకు చెందిన యడ్లపల్లి సత్యప్రణవిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యప్రణవి మరెన్నో ఉన్నత ప్రదర్శనలిచ్చి జగ్గంపేటకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

37 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం మరలా కలుసుకున్నారు. కేరళ, హైదరాబాద్‌లతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎలా ఉన్నావు... ఏమి చేస్తున్నావంటూ పలకరించుకున్నారు. ఆహ్లాదంగా గడిపారు. భోజనాలు చేసి శివరాత్రి ఉత్సవాలకు వెళ్లి భ్రమరాంబికా మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. జలపాతాలను చూసి తిరిగి జడ్డంగి ప్రధాన రహదారికి చేరుకుని స్వస్థలాలకు చేరుకున్నారు. పి.సత్యనారాయణ, ఎస్.బుజ్జి, టీవీఎస్ శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, లలిత, హేమలత, ఎస్.వెంకటపద్మజ, శేషారత్నం, ఝాన్సీ శ్రీలక్ష్మి, వెంకటరమణ, ఎం.రాజు, కొండలరాజు, జనార్దన్, సురేష్‌బాబు, రమేష్, దుర్గాప్రసాద్, వసంతరాయుడు, పైడిరాజు, విఘ్నేశ్వరరావు, జగపతి పాల్గొన్నారు.



1987-88 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

ఆకస్మిక తనిఖీలు

దేవీపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయంలో భాగంగా ఈనెల 19వ తేదీ నుంచి మండలంలోని దేవారం, చిన్నభీంపల్లిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేశారు. ఎస్.రామన్నపాలెంలో దాడులు చేసి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. ఎవరైనా నాటుసారా తయారు చేస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ కోరారు.

'అమరవీరుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి'

ఏలేశ్వరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో మాదిగల అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు గురువారం పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటాలు చేసిన అమరవీరుల త్యాగాలకు వచ్చేనెల 1న నివాళులర్పించాలన్నారు.